అంబరాన్నంటిన విజయదశమి సంబురం


రావణ దహన కాండ దృశ్యం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో విజయ దశమి (దసరా) సంబురాలు అంబరాన్నంటాయి. భక్తులు ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. పండుగను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు. వ్యాపారులు తమ దుకాణాల్లో ఆయుధ పూజలు నిర్వహించారు. ప్రజలు తమ వాహనాలకు పూజలు చేశారు. సాయంత్రం జమ్మి చెట్టును దర్శించుకుని రావణ దహన కార్యక్రమాన్ని తిలకించారు. జై భవనీ... జైశ్రీరామ్ నినాదాలతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు కార్పొరేటర్లు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

– కుత్బుల్లాపూర్


సుచిత్రలో దుర్గామాత పూజల్లో పాల్గొన్న లక్ష్మణ్‌గౌడ్ దంపతులు


కుత్బుల్లాపూర్ గ్రామంలో శ్రీరామాంజనేయ భక్త బృందం ఆధ్వర్యంలో జరిగిన దసరా ఉత్సవంలో పావురాలను ఎగురవేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు కె.ఎం.ప్రతాప్


నర్సాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో యాగంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు


కొంపల్లిలో రావణ దహనం చేస్తున్న చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్


దూలపల్లిలో జరిగిన రావణ దహనం చేస్తున్న స్థానిక నాయకులు


గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్‌లో జరిగిన జమ్మి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్


చింతల్‌లో దుర్గామాత మండపం వద్ద పూజలు


నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి దంపతులకు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు

క్లుప్తంగా

'ఇట్ ఈజ్ నాట్ జస్ట్' చిత్ర ప్రదర్శన

మాదాపూర్: చిత్ర కళాకారిణి సబిత లక్ష్మణ్ వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఇట్ ఈజ్ నాట్ జస్ట్ పేరిట నిర్వహిస్తున్న చిత్రప్రదర్శన సందేశాత్మంగా ఉందని కళాకారులు కొనియాడుతున్నారు. ఈనెల 29వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో 38 చిత్రాలు ప్రదర్శనలో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.


ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు


పోలాల బస్తీలో మల్లన్న ఆలయ భూమిపూజలో పాల్గొన్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: ఆలయాలు మానసిక ప్రశాంతకు నిలయాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూమ్ నగర్ పరిధి పోలాల బస్తీలో నూతనంగా నిర్మించనున్న మల్లన్న ఆలయ భూమి పూజకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో దాసు, ప్రభాకర్, కుర్మారెడ్డి, పాపిరెడ్డి, గణేష్, సురేందర్, రాజ్‌కుమార్, మాణిక్యంచారి, రాములు, సుధాకర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉంది

రెవరెండ్ పి.జయరావు



ఐడీపీఎల్ కాలనీలో ప్రారంభించిన హాల్ ఆఫ్ పీస్ క్రిస్టియన్ ఫంక్షన్‌హాల్

రంగారెడ్డినగర్: పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు క్రైస్తవులకు సొంతంగా ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని సైనిక్‌పురి అగాపే గ్రేస్ ఫెలోషిప్ రెవరెండ్ పి.జయరావు అన్నారు. మంగళవారం ఐడీపీఎల్ కాలనీలో నూతనంగా నిర్మించిన హాల్ ఆఫ్ పీస్ క్రిస్టియన్ ఫంక్షన్‌హాల్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జయరావు మాట్లాడుతూ.. వివాహాది శుభకార్యాలకు ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌కు వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోందన్నారు. ఇకపై తక్కువ ఖర్చులో క్రైస్తవులు ఇందులో శుభకార్యాలు చేసుకోవచ్చన్నారు.



ఎన్నికల వేళ.. అధికారులు లేక

- కార్యాలయాల్లో ఖాళీ కుర్చీలు కనిపిస్తున్న వైనం
- ముందుకు కదలని దరఖాస్తులు
- కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో 18 సిబ్బంది
- అందులో 16మందికి ఎన్నికల ప్రత్యేక విధులు


తహసీల్దార్ కార్యాలయం ఖాళీగా ఉన్న దృశ్యం


అధికారుల రాక కోసం పడిగాపులు కాస్తూ..

సుభాష్‌నగర్: నవంబర్‌లో జరగనున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది బిజీగా ఉండడంతో తహసీల్దార్ కార్యాలయంలో ఫైళ్లు ముందుకు కదలడం లేదు. ఇటీవల ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న 18 మందిలోని 16 మంది సిబ్బంది సర్కిల్ కార్యాలయంలో ఎన్నికల విషయమై ప్రత్యేక విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు కనిపిస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చేవారు అధికారులు లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు. కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాల కోసం రెండు నెలల క్రితం దరఖాస్తు పెట్టుకున్నా జారీ చేయడం లేదని వాపోతున్నారు. ఏది ఏమైనా ఎన్నికలు అయ్యేంత వరకు ఇలాగే కొనసాగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

రెండు నెలలు అవుతోంది..



మా కూతురు పై చదువుల నిమిత్తం కుల ధ్రువీకరణ పత్రం కోసం రెండు నెలల క్రితం దరఖాస్తు పెట్టుకున్న. ఇంతవరకు ధ్రువీకార పత్రాన్ని జారీ చేయలేదు. గత పది రోజుల నుండి కార్యాలయం చుట్టూ తిరుగుతున్న సంబంధిత అధికారులు అందుబాటులో ఉండటం లేదు. ఎలక్షన్ డ్యూటీలో ఉన్నారని సిబ్బంది సూచిస్తున్నారు. విద్యార్థుల సమస్యను దృష్టిలో పెట్టుకొని రోజు ఒక గంట పాటు కేటాయిస్తే బాగుంటుంది.

– రాజేందర్ కుమార్, గాజులరామారం గ్రామం

5న జీవన విద్యపై వర్క్‌షాప్

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో 'జీవన విద్య' అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నవంబర్ 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జీవితాన్ని ఆనందమైన, అర్థవంతమైన ప్రయాణంగా మార్చుకోవడానికి , సంతృప్తికరమైన జీవనంగా మార్చుకునేందుకు అవకాశం కల్పించేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం వాసు 9849285628,శ్రీనివాస్ 9948885111లో సంప్రదించాలని వారు కోరారు.

ఏబీవీపీ ఆందోళన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. చెన్నైలో జాతీయ పతాకానికి జరిగిన అవమానాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి ఆందోళన చేశారు. తమిళనాడు ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్లకార్డులు పట్టుకొని, నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పలువురు హెచ్‌సీయూ ఏబీవీపీ నాయకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీ అడ్వైజరీ గ్రూపు సభ్యుడిగా ప్రొ.సారంగ్ డియో

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ప్రొఫెసర్ సారంగ్ డియోకు అరుదైన అవకాశం కలిగింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్‌ఓ) ద్వారా క్షయవ్యాధికి సంబంధించిన వ్యూహాత్మక, సాంకేతిక సలహా బృందం(ఎస్‌టీఏజీ) సభ్యునిగా నియమించింది. ఆయన ప్రస్తుతం ఐఎస్‌బీలో ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్‌గా, ఫ్యాకల్టీ అండ్ రీసెర్చ్ డిప్యూటీ డీన్, మాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వివిధ హోదాలలో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

అక్తర్ హుస్సేన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థి అక్తర్ హుస్సేన్‌కు మంగళవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఆయన విశ్వవిద్యాలయంలోని సోషల్ వర్క్ విభాగంలో పరిశోధక విద్యార్థి. 'ముస్లింల జీవితాలపై విద్య ప్రభావం: హైదరాబాద్ నగరం యొక్క అధ్యయనం' అనే అంశంపై థీసిస్ సమర్పించారు. ప్రొఫెసర్ ఎండి షాహిద్‌రజా, ఆగ్రాలోని డాక్టర్ బీమ్‌రావ్ అంబేడ్కర్ యూనివర్శిటీ డాక్టర్ మొహద్‌హుస్సేన్ సహ పర్యవేక్షణలో పీహెచ్‌డీని పూర్తి చేశారు.

సిల్ట్ కార్టింగ్ వాహనాలు వచ్చేశాయ్..

దసరా కానుకగా దళితబంధు లబ్ధిదారులకు అందజేత


కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలో దళిత బంధు సిల్ట్ కార్టింగ్ వాహనాలు

చింతల్: దళితబంధు ద్వారా జలమండలిలో ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం అందజేసిన సిల్ట్ కార్టింగ్ వాహనాలు కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయానికి చేరాయి. వాటిని దళితబంధు లబ్ధిదారులకు ప్రభుత్వం దసరా కానుకగా అందజేసింది. మరో రెండు రోజుల్లో మరికొన్ని వాహనాలు రానున్నట్లు తెలుస్తోంది. ఒక్కో సెక్షన్ పరిధిలో ఒక్కో వాహనం పనిచేసే విధంగా మొత్తం ఎనిమిది సిల్ట్ కార్టింగ్ వాహనాలను కేటాయించారు. జలమండలిలో దళిత బంధు పథకం ద్వారా కుత్బుల్లాపూర్‌లో వాహనాలను దక్కించుకున్న లబ్ధిదారుల వివరాలు ఇలా ఉన్నాయి.

◆ చింతల్ సెక్షన్‌లో చిలుక సతీష్, సుచిత్ర సెక్షన్‌లో చింతల రాజలింగం, జీడిమెట్ల సెక్షన్ పరిధిలో బోతు ఆకాష్, షాపూర్‌నగర్ సెక్షన్ మండమీద రాజ్‌కుమార్, గాజులరామారం సెక్షన్ పరిధిలో ఎన్.అలేఖ్య, సూరారం సెక్షన్‌లో బి.రాములు, జగద్గిరిగుట్ట సెక్షన్‌లో బండారం సాయిరామ్, భగత్ సింగ్‌నగర్ సెక్షన్ పరిధిలో ఎలుక అరుణలత, ఆదర్శ నగర్ సెక్షన్‌లో వంగ రాజు, ఉషోదయ సెక్షన్‌లో రెక్కల నవీన్‌కుమార్ లు తెలంగాణ ప్రభుత్వం ద్వారా జలమండలిలో సిల్క్ కార్టింగ్ వెహికల్ పొందారు. ఈ వాహనాలపై జీఎం శ్రీధర్ రెడ్డిని వివరణ కోరగా మరిన్ని వాహనాలు మరో రెండు మూడు రోజులు డివిజన్‌కి రానున్నాయి అని, వాటిని ఒక్కో సెక్షన్‌కు కేటాయించి పది సెక్షన్ల పరిధిలో ఉన్న గల్లీలలో ఎప్పటికప్పుడు తరలించేందుకు సిద్ధంగా ఉంటాయన్నారు. ప్రభుత్వం ఈ పథకం ద్వారా కొంత మందికి ఉపాధి కల్పించడంతో పాటు నగరాన్ని సుందరీకరణలో భాగంలో తమ వంతు పాలుపంచుకునేందుకు ఈ పథకం ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని 'సాక్షి'కి తెలిపారు. పూర్తిస్థాయిలో వాహనాలు డివిజన్‌కు రాగానే వాటిని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

దేశం కోసం నిలబడే పార్టీలకే మద్దతు తెలపాలి


హిందూవాహిని ఆధ్వర్యంలో జరిగిన సభలో మాట్లాడుతున్న స్వామి యోగేష్ ప్రభుజీ

కుత్బుల్లాపూర్: దేశం కోసం, హిందూ ధర్మం కోసం నిలబడే పార్టీలకు ఎన్నికల్లో మద్దతు తెలపాలని స్వామి యోగేష్ ప్రభుజీ అన్నారు. సోమవారం రాత్రి కుత్బుల్లాపూర్ మున్సిపల్ మైదానంలో హిందూవాహిని ఆధ్వర్యంలో జరిగిన రావణ దహనకాండ కార్యక్రమానికి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్రనేత కూన శ్రీశైలంగౌడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లౌకికవాదం ముసుగులో కొన్ని పార్టీలో హిందువులను విడగొట్టి ధర్మాన్ని నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కుహానా లౌకికవాదులకు బుద్ధి చెప్పాలన్నారు. సభా ప్రాంగణమంతా జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని రాష్ట్ర అధ్యక్షులు రాజు గారు, గోరక్షక్ నరేశ్, హిందువాహని నాయకులు, కార్యకర్తలు వీహెచ్‌పి, ఏబీవీపీ, బజరంగ్‌దళ్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచే దిశగా

ఇంటి వద్ద నుంచే ఓటుకు అవకాశం

- వృద్ధులకు, దివ్యాంగులకు చాన్స్
- ఈనెల 30 దరఖాస్తులకు అవకాశం
- నవంబర్ 7వ తేదీ లోపు ప్రక్రియ
- నియోజకవర్గంలో 80 ఏళ్ల వృద్ధులు 4,934
- మొత్తం దివ్యాంగ ఓటర్లు 5348



కుత్బుల్లాపూర్: వృద్ధులు, వికలాంగులు శ్రమ పడకుండా ఇంటి నుంచి ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తుంది ఎలక్షన్ కమిషన్. ఈ అవకాశం అందరికీ మాత్రం కాదు. కేవలం 80 సంవత్సరాలు పైబడిన వద్దులకు, 40 శాతానికి పైబడి అంగవైకల్యం కలిగి ఉన్న దివ్యాంగులకు ఈ అవకాశాన్ని ఇవ్వనున్నది. ఇందుకు ఇప్పటికే కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో ఉన్న అర్హత కలిగిన వృద్ధులు, దివ్యాంగులకు సంబంధిత బూత్ లెవెల్ సిబ్బంది దరఖాస్తులను అందిస్తున్నారు. ఎవరిని బలవంత పెట్టకుండా వారి ఇష్టానుసారంగానే దరఖాస్తు తీసుకొని ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు చేపడుతున్నట్లు కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు తెలిపారు.

10282 మంది ఓటర్లకు అవకాశం...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో మొత్తం తుది జాబితా ప్రకటించే వరకు 6,69,253 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 3,51,307 కాగా, స్త్రీలు 3,17,793 ఉన్నారు . 153 మంది ఇతరులు ఉండగా వీరిలో ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అర్హత కలిగి ఉన్న 80 సంవత్సరాల పైబడిన వద్దులు 4,934 , దివ్యాంగుల ఓటర్స్ 5,348 మంది కలిపి మొత్తం 10,282 ఉన్నట్లుగా గుర్తించారు. వీరందరూ ఇంటి వద్ద నుంచి ఓటు హక్కును వినియోగించుకునే అర్హత కలిగి ఉన్నారు.

నవంబర్ 7వ తేదీ లోపు పూర్తి చేయాలి..

ఇంటి వద్ద నుంచి ఓటు హక్కును పొందే విషయంలో వృద్ధులు, దివ్యాంగులకు బూత్ లెవెల్ సిబ్బంది 12-డి ఫామ్స్‌ను అందిస్తున్నారు. సదరు పూర్తి చేసిన దరఖాస్తులు నవంబర్ 7వ తేదీ లోపు కుత్బుల్లాపూర్ రిటర్నింగ్ కార్యాలయంలో కానీ, సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్లకు గాని అందజేయాలి. ఈ నెల 30 వరకు దరఖాస్తులు పొందే అవకాశం ఉన్నది.

మొత్తం వీడియో చిత్రీకరణ..

దరఖాస్తులు పరిశీలించిన అనంతరం అర్హత పొందిన ప్రతి ఒక్కరికి నిర్దేశిత తేదీన బ్యాలెట్ పత్రాలను అందిస్తారు. ఓటరు బ్యాలెట్ పత్రంపై స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చు. ఈ తతంగం మొత్తం ప్రొసీడింగ్ ఆఫీసర్ సమక్షంలో జరగడంతో పాటుగా వీడియోని కూడా చిత్రీకరిస్తారు. ఓటరు తన ఓటు హక్కును తన నివాసంలోనే ఎవరూ చూడకుండా ఓటు వేయవచ్చు. పూర్తి పారదర్శకంగా సాగే ఈ ప్రక్రియ లో ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని, తప్పకుండా సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు స్పష్టం చేశారు.

ఓటింగ్ శాతాన్ని పెంచే దిశగా...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 50శాతం మించకుండా పోలింగ్ జరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారి పులి సైదులు పలు దఫాలుగా కాలనీ సంక్షేమ సంఘాలతో పాటు బూతు లెవెల్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి ఓటింగ్ శాతాన్ని పెంచుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. 2018లో 55.97 నమోదు కాగా 2023 నవంబర్ 30న జరిగే ఓటింగ్ కు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పలు పోలింగ్ స్టేషన్లను నూతనంగా ఏర్పాటు చేసి వెసులుబాటు కల్పించారు.

చందానగర్‌లో రూ.28 లక్షలు సీజ్

హఫీజ్‌పేట్ : చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంగారం ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రవికుమార్ అనే వ్యక్తి వాహనంలో 28 లక్షల 9వేల 519 రూపాయలు తరలిస్తుండగా ఎస్ఓటీ, చందానగర్ పోలీసులు గుర్తించారు. డబ్బుకు సంబంధించిన సరైన పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం సీజ్ చేసిన డబ్బును ఎన్నికల అధికారులకు అప్పగిస్తామని సీఐ పాలవెల్లి తెలిపారు.

ముమ్మర తనిఖీలు

మాదాపూర్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో చందానగర్ శ్రీదేవి థియేటర్, అమీన్‌పూర్ రోడ్డులో ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి, ఎన్నికల అధికారులు, ప్రత్యేక టీంలతో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాల తనిఖీ చేస్తున్నట్లు డీసీపీ నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

జంగ్ 2023 తెలంగాణ

కుత్బుల్లాపూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడబోతోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం సుభాష్‌నగర్ డివిజన్ గంపల బస్తీకి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రజలు నమ్ముతున్నారన్నారు. అందులో భాగంగానే చేరికలు జరుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీలు తలకిందులా తపస్సు చేసినా కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు